క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాలకు స్టాక్ ఇవ్వలేదని ఫిర్యాదు



శెట్టూరులో డీటీకి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ

శెట్టూరు: మండలంలోని కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిప్పు ఇవ్వలేదని డీటీ మహేశ్వరరెడ్డికి అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ గురువారం ఫిర్యాదు చేసింది. పర్లచేడు, వడ్డిపాళ్యం, రంగయ్యపాళ్యం, తిప్పనపల్లి గ్రామాల్లోని చౌక డిపోల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు స్టాక్ ఇవ్వలేదన్నారు. డీలర్లను అడిగితే స్టాక్ రాలేదని సాకు చెప్తున్నారన్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, కందిపప్పు సక్రమంగా అందేలా చూడాలని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో నాగమణి, సామిత్రమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై సేవలు అందించండి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఏఓ ఆంజనేయులు

కంబదూరు: సచివాలయ ఉద్యోగులు ప్రజలతో మమేకమై సేవలు అందించాలని మండల పరిషత్ పరిపాలన అధికారి ఆంజనేయులు సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో కంబదూరు సచివాలయం -1,2,3,4 పరిధిలోని సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు పరివర్తన నియమావళిపై తెలియజేశారు.

ఉపాధి బిల్లులు వెంటనే చెల్లించండి



ఏఓ ఆంజనేయులుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు

కంబదూరు: పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బిల్లులను చెల్లించాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘం నాయకులు కోరారు. గురువారం సంఘం మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఏఓ ఆంజనేయులను కలిసి ఉపాధి హామీలు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కూలీలు పడుతున్న బాధలను అధికారులకు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘం నాయకులు గోపాల్, రామాంజి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

7న మాదిగల మహా జాతర



మహా జాతర కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కూడేరు: ప్రకాశం జిల్లా ఈదుమూడులో ఈ నెల 7న మాదిగల మహా జాతర సభను నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న తెలిపారు. గురువారం కూడేరులో మహా జాతర సభ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మహా జాతర సభలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యచరణ, మాదిగలు, ఉపకులాలపై జరుగుతున్న దాడులపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు, మురళి, బాలకృష్ణ, ధనుంజయ్య, వెంకటేశులు, సుబ్బరాయుడు, రాజు, రమణ, నాగరాజు, వీహెచ్‌పీఎస్ నాయకులు వెంకటేశులు, కిరణ్, సంగప్ప, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

కళ్యాణదుర్గం: బెళుగుప్ప మండలం రమణేపల్లి, గుండ్లపల్లి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సీజ్ చేసినట్లు పట్టణ సీఐ హరినాథ్ తెలిపారు. పట్టణంలోకి వస్తున్న ఏపీ 39 టీడీ 8840, ఏపీ40ఎన్ 2360, ఏపీ26టికె 0090 నంబర్లు గల ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించి, తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు సిఫార్సు చేశారు.

చినుకు జాడలేదు.. విత్తు సాగలేదు

- సాగని ఖరీఫ్ విత్తన సాగు
- జాడలేని వర్షాలు – ఆందోళనలో రైతన్నలు



విత్తుకు సిద్ధం చేసిన నేల

రాయదుర్గం: ఖరీఫ్ ప్రారంభమైంది..కార్తెలు ఒక్కొక్కటి కరిగిపోతున్నాయి. అయినా వరుణుడు కరుణించలేదు. పొలాలను దుక్కులు చేసుకుని, వేరుశనగ విత్తన సాగుకు రైతన్నలు సన్నద్ధమయ్యారు. ఆరంభంలో నైరుతి రుతు పవనాలు ఆశ చూపినా.. ఆ తర్వాత ఆవిరయ్యాయి. ఇప్పటికే మృగశిర కార్తె ముగిసింది. ఆ తర్వాత వచ్చిన ఆరుద్ర కూడా మరో మూడు రోజుల్లో పూర్తవుతుంది. ఈ నెల 6న పునర్వసు కార్తె రానుంది. అయినా చినుకు జాడ కనిపించలేదు. దీంతో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. ఈనెల 15 వరకు వేరుశనగ విత్తుకోవచ్చని వ్యవసాయాధికారులు చెప్తున్నా..ఆలోపు వర్షాలు వస్తాయో లేదోనన్న బెంగ రైతన్నలను పట్టుకుంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఇప్పటి దాకా పదునైన వర్షం కురవలేదు. దీంతో 15 శాతం కూడా ఖరీఫ్ విత్తన సాగు కాలేదు. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ 2,90,473 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం ఉంది. 2,45,517 హెక్టార్లు సాగుకానుందని అంచనా. ఇప్పటి దాకా సాగైంది కేవలం 15,409 హెక్టార్లు మాత్రమే. ఇందులో ఎక్కువ శాతం వేరుశనగ సాగయ్యింది. ఆ తర్వాత కంది, ఆముదం, పత్తి పంటలు సాగులోకి వచ్చాయి. మిగిలిన రైతులు వర్షం కోసం ఆకాశం వైపు ఎదురుచూస్తూనే ఉన్నారు. చెరువులు, కుంటల్లోనూ నీరు ఇంకిపోతుండడంతో బోరు బావుల్లో కూడా నీరు అడుగంటిపోయింది.

సాగు అయిన పంటలకూ ఇబ్బందే..

సాగు అయిన పంటలకూ నీరు అవసరం. మొలకెత్తిన విత్తనాలు కూడా వర్షం లేకపోతే మొలకలన్నీ ముడుచుకుపోయే అవకాశం ఉంది. దుక్కి చేయడానికి, విత్తనాలు, ఎరువులకు రైతులు ఇప్పటికే పెట్టుబడి పెట్టారు. ఈ సమయంలో వరుణుడు కరుణించకపోతే అన్నదాతల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పరిస్థితి ఇలాగే ఉంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

ఇంకా సమయం ఉంది

ఖరీఫ్ సాగు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ సూచించారు. వర్షాలు కురిసినప్పుడే విత్తుకోవాలన్నారు. అరకొర తేమలో విత్తుకోవడం సరికాదు.. ఈ నెల ఆఖరి వరకు విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. వాతావరణంలో మార్పులు కనిపిస్తుండడంతో వర్షలు తప్పక కురుస్తాయని తెలిపారు. రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో ఈనెల 6న ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. పట్టణంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారీగా అధికారులు హాజరు కావాలని కోరారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

బ్రహ్మసముద్రం : మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీఓ దాసానాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామీణా ఉపాధి హామీ పథకంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఏఓ నందకిశోర్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుతానంద, టెక్నికల్ అసిస్టెంట్లు పండరీష్, అమరేష్, బీఎఫ్‌టీ, వన్నూర్ స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ రంగనాయకులు

రాయదుర్గం రూరల్: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు పాటుపడాలని ఎంపీడీఓ అల్లాబకాష్ , ఈఓపీఆర్డీ రంగనాయకులు తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు పారిశుధ్యం మెరుగుపై సూచనలు , సలహాలు ఇచ్చారు. ఇంటి పరిసరాలు, వీధులు అపరిశుభ్రంగా ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది డయేరియా, మలేరియా, జ్వరం, ఫ్లూ లాంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. వాంతులు, విరేచనాలు, తలనొప్పి, వికారం, జ్వరంతో రోగులు వస్తే వెంటనే వైద్య చికిత్సలు అందించాలని ఏఎన్ఎంలకు వారు సూచించారు.

చిన్న ఓబులేసు మృతి తీరని లోటు



కూడేరు:చిన్న ఓబులేసు భౌతికాయానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

కూడేరు: సంగమేశ్వర నాటక కళా సమితి మండల కార్యవర్గ సభ్యుడు, సీనియర్ కళాకారుడైన మండల పరిధిలోని అంతరంగకు చెందిన చిన్న ఓబులేసు మృతి కళా రంగానికి తీరని లోటు అని నాటక కళా సమితి సభ్యులు కొనియాడారు. గురువారం చిన్న ఓబులేసు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో నాటక కళా సమితి సభ్యులు ముట్టాల శ్రీరాములు, కురుబ సంగప్ప, మలరాయుడు, వెంకటేశులు, కాశీం, మల్లికార్జున, ఆదినారాయణ, దానిమీక, ఈశ్వరయ్య, ఆంజనేయులు, హనుమంతప్ప, పెద్ద ఓబులేసు, గోవిందప్ప, శ్రీహరిలు మృతిని ఇంటికి వెళ్లి ఓబులేసు భౌతికాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

కళ్యాణదుర్గం రూరల్: అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఎస్వీజీఎం డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జయరాం, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడారు.

కుందుర్పి: మండలంలోని కలిగొలిమి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం విప్లవవీరుడు అల్లూరి సీతా రామరాజు జయంతిని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాజు, కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు అంజినాయక్, నాయకులు మారెన్న, ఓబన్న, బోయ మారెన్న, మాజీ సర్పంచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి జిందాల్ సాయం

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లోని సీసీ రోడ్డు నిర్మాణం కోసం హరేసముద్రం గ్రామ పరిధిలో ఉన్న జిందాల్ సావ్ కర్మాగారం రూ.13 లక్షల సహాయం అందించింది. బొమ్మనహాళ్‌లోని సుంకలమ్మ దేవి వీధిలో పాండురంగస్వామి ఆలయం నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు సీసీ రోడ్డు వేయించాలని గ్రామస్తుల వినతి మేరకు జిందాల్ సావ్ యాజమాన్యం రూ.13 లక్షల సహాయం అందించడంతో సీసీ రోడ్డును వేశారు. గతంలో ఈ కాలనీలో అధ్వానంగా ఉండేదని జిందాల్ సావ్ యాజమాన్యం సహాయంతో సీసీ రోడ్డు నిర్మాణం అయిందని స్థానికులు తెలిపారు.

పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకోండి

కూడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కల సాగుకు చిన్న,సన్న కారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ తులసీ ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదెకరాల వరకు చీనీ, దానిమ్మ, జామ, అల్లనేరేడు, నిమ్మ తదితర పండ్ల మొక్కల పెంపకం నిర్వహణను మూడేళ్ల వరకు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వారం రోజులు లోపు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్: 99639 15363లో సంప్రదించాలన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



ఉరవకొండ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు

రాయదుర్గంటౌన్: దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాయదుర్గంలో (ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ) చేపట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. గురువారం పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయిస్తున్న క్రమంలో విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి, స్టేషన్‌కు తరలించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు అనిల్ మాట్లాడారు.

ఉరవకొండలో విద్యాసంస్థల బంద్

ఉరవకొండ: ఉరవకొండలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల బంద్ గురువారం విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, జూనియర్, కళాశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు అన్నీ బంద్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట జరిగిన ధర్నాలో ఏఐఎస్ఎఫ్ నాయకులు హరున్ రషీద్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దార్థ్, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మ, సిసింద్రీ, పీఎస్‌యూ జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలో నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమంతురాయుడు మాట్లాడుతూ నీట్ పరీక్షలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తాలూకా ఉపాధ్యక్షుడు నవీన్, సిద్దు, పట్టణ అధ్యక్షుడు శివమూర్తి, హర్షవర్ధన్, ఉపాధ్యక్షుడు అజయ్, మధు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో పనిచేయని వాటర్‌ప్లాంట్



ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో నిరుపయోగంగా వాటర్‌ప్లాంట్

ఉరవకొండ: స్థానిక 50 పడకల ఆస్పత్రిలో కొంత కాలంగా రోగులకు తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ పనిచేయలేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. వాటర్ ప్లాంట్ మూలన పడినా మెడికల్ ఆఫీసర్, వైద్యులు ఏమాత్రం పట్టించుకోలేదని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన రోగులు, వారి బంధువులు ఇళ్ల నుంచే బాటిళ్లలో తీసుకొస్తున్నారు. మరికొందరు తప్పని సరి పరిస్థితుల్లో బయట నీరు కొని తాగుతున్నారు.

భోజన ఏజెన్సీ నిర్వాహకురాలికి పరామర్శ



గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న సుంకమ్మను పరామర్శిస్తున్న భీమిరెడ్డి

వజ్రకరూరు: గుంతకల్లు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఛాయాపురం మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు బోయ సుంకమ్మను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, ఖోఖోఅసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి పరామర్శించారు. గురువారం ఉదయం ఛాయాపురంలో ప్రభుత్వ పాఠశాలలో టీడీపీ నాయకుల ఒత్తిళ్లకు మన స్థాపనకు గురై మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు బోయ సుంకమ్మ క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వై.భీమిరెడ్డి గుంతకల్లు ఆస్పత్రికి చేరుకొని బాధితురాలిని పరామర్శించారు. కు టుంబ సభ్యులతో వివరాలు ఆరాతీశారు.

28న మల్లెల కవితా సంపుటాల ఆవిష్కరణ

అనంతపురం కల్చరల్: జలస్వప్నం కవి మల్లెల నరసింహమూర్తి రాసిన మట్టి తంబూర, మాకూ ఒక నది కావాలి కవితా సంపుటాలను ఈనెల 28న ఆవిష్కరించనున్నారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే సాహితీ కార్యక్రమంలో సాహిత్యాభిమానులందరూ పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో సర్మాస్ హుసేనీస్వామి

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మాస్ హుసేనీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామివారం కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి దర్శనానికి బారులుతీరారు.

డిగ్రీ కళాశాలకు నూతన శోభ



ప్రహరీ, ముఖద్వార నిర్మాణంతో సుందరంగా కనిపిస్తున్న ఉరవకొండ డిగ్రీ కళాశాల

ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు ముఖద్వారం ఏర్పాటు కావడంతో నూతన శోభ చేకూరింది. కొన్నేళ్లుగా కాంపౌండ్ వాల్ లేక కళాశాలకు రక్షణ లేకుండేది. దీంతో విద్యాశాఖ కమిషనర్ అనుమతులతో కళాశాల నిధుల నుంచి రూ.35 లక్షల వ్యయంతో కాంపౌండ్ వాల్ నిర్మాణం ప్రారంభించారు. ఈనిధులతో కాంపౌండ్ వాల్‌తో పాటు నూతన ముఖద్వారం ఏర్పాటు చేయడంతో కళాశాల నూతన శోభను సంతరించుకుంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



భూపసముద్రం పాఠశాలలో పరిశుభ్రతపై వివరిస్తున్న దృశ్యం



కంబదూరులో పేడ దిబ్బలను తొలగిస్తున్న డాక్టర్ ఆసియా

బ్రహ్మసముద్రం : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని కొత్తిండ్ల కాలనీలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, డయేరియా తదితర వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ మేరీ, సూపర్‌వైజర్ రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు , వైద్య ఆరోగ్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అతిసార వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

బొమ్మనహాళ్: చిన్నారులు అతిసార వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, మల్లేశ్వరి సూచించారు. మండలంలోని దేవగిరి క్రాస్‌లో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భగా వైద్యులు మాట్లాడుతూ డయేరియాను నిర్లక్ష్యంగా చేస్తే ప్రమాదకరంగా మారుతుందన్నార. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త గోవర్ధన, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కణేకల్లులో వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ విజయకుమార్‌నాయక్

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గుమ్మఘట్ట: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండొచ్చని ఏఎన్ఎం సావిత్రి తెలిపారు. మండలంలోని భూపసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిసరాలు–పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డయేరియా వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆనందరావు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కంబదూరు: సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, డయేరియా తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఆసియా ప్రజలకు సూచించారు. గురువారం మండలంలోని అచ్చంపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం గ్రామంలో వ్యాధులకు కారణమైన చెత్తాచెదారాన్ని, పేడదిబ్బలను సర్పంచ్ కోక ముత్యాలమ్మతో కలిసి తొలగింపజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సవారమ్మ, కామక్షి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించండి

కణేకల్లు: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని యర్రగుంట పీహెచ్‌సీ డాక్టర్ విజయకుమార్ నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని గెనిగెర గ్రామ జెడ్పీ హైస్కూల్‌తోపాటు గ్రామంలో 'డయేరియా–వైరల్ ఫీవర్స్'పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చేతులు సబ్బుతో కడుక్కోవడం అలవాటు చేసుకోవాలన్నారు. భోజనానికి ముందు, వంట చేసేటప్పుడు, మలమూత్ర విసర్జన సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫ్రై డే డ్రై డేగా పాటించాలన్నారు. నీటితొట్టెలు, టైర్లు,టెంకాయ చిప్పల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి పెరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ తిరుపాయల్‌నాయక్, హెల్త్ అసిస్టెంట్ మురళీకృష్ణయ్య, ఏఎన్ఎం ముత్యాలమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గురు పౌర్ణమి ఘనంగా నిర్వహిస్తాం

అనంతపురం కల్చరల్: ఈ ఏడాది గురుపౌర్ణమి వేడుకలను సాంస్కృతిక సంబరాలతో విభిన్నంగా నిర్వహిస్తున్నామని పలువురు వక్తలు తెలిపారు. గురువారం స్థానిక వేమన టెలిఫోన్ భవన్ ఎదురుగా ఉన్న షిర్డీ సాయి బాబా మందిరం వ్యవస్థాపక సభ్యుడైన జయచంద్ర చౌదరి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయచంద్ర చౌదరితో పాటూ మందిర సేవా సంఘం ఉపాధ్యక్షులు పసుపులేటి కృష్ణమూర్తి, కార్యదర్శి వెంకటస్వామి, నాగానంద గుప్తా తదితరులు మాట్లాడారు. గురుపౌర్ణమి సందర్భంగా సాయినాథుడికి సంప్రదాయ నృత్యనీరాజనాలు, సాంస్కృతిక సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో నాట్యమయూరిగా పురస్కారం అందుకున్న హరిత నాట్యప్రదర్శన, సన్మానం ఉంటాయని తెలిపారు. ఈనెల 21న ఉదయం కాకడ హారతి, మంగళస్నానం, సామూహిక సత్యసాయి వత్రాలు జరుగుతాయన్నారు. ప్రతిసారి మాదిరే జిల్లాలోనే పెద్ద ఎత్తున ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేస్తామని వెల్లడించారు. షిర్డీ క్షేత్రం తరహాలో సాయినాథుడికి జరిగే హారతులు, అలంకార సేవల్లో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలందుకోవాలని కోరారు. అంతకు ముందు మందిరంలో సాయిబాబాకు విశేష పూజలు, అన్న సంతర్పణ కార్యక్రమాలు జరిగాయి.